క్లుప్తంగా

పిల్లల భవితకు పునాది అంగన్‌వాడీ కేంద్రాలు


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సీడీపీవో రమణకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు

సీతమ్మధార: భావిభారత పౌరులకు పునాది అంగన్‌వాడీ కేంద్రాలని ఐసీడీఎస్ విశాఖ అర్బన్ ప్రాజెక్ట్ సీడీపీవో రమణకుమారి అన్నారు. నక్కవానిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని గురువారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోషణ భీ పఢాయి కార్యక్రమంలో మూడు రోజుల పాటు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. మూడేళ్ల లోపు పిల్లలకు సంరక్షణ ఇస్తూ పోషకాహారాన్ని వారి తల్లులకు అందిస్తామన్నారు. 3 నుంచి 6 ఏళ్ల లోపు పిల్లలకు భాష, అంకెలు నేర్పిస్తామని చెప్పారు. పిల్లల సమగ్ర అభివృద్ధికి ఏమేం చేయాలన్న అంశాలపై అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇస్తామన్నారు. పలు అంశాలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. అదనపు సీడీపీవో శ్రీలత, సూపర్‌వైజర్లు వరలక్ష్మి, వినీషాసుందరి, జీవీఎంసీ పాఠశాల ప్రధానోపాధ్యాయిని పద్మజారాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

లయన్స్ క్యాన్సర్ ఆస్పత్రికి రూ.3.80 లక్షల విరాళం


ఆస్పత్రి ట్రస్టీ ఉమామహేశ్వరరావుకు విరాళం చెక్కు అందిస్తున్న డైరెక్టర్ కృష్ణారావు

సీతమ్మధార: సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని లయన్స్ క్యాన్సర్ ఆస్పత్రిని గురువారం ఎన్వేదా థెరప్యూటిక్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ కృష్ణారావు సందర్శించారు. జిల్లా గవర్నర్ లయన్ ప్రొఫెసర్ ప్రసాద్ సమక్షంలో ఆస్పత్రి మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ వి.ఉమామహేశ్వరరావుకు రూ.3.80 లక్షల చెక్కును కృష్ణారావు అందజేశారు. ఆస్పత్రిలోని ఐసీయూ విభాగాన్ని తాజా సౌకర్యాలతో బలోపేతం చేయడానికి ఆయన ఆస్పత్రికి అందించిన సేవలను అభినందించారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ లయన్స్ ఆస్పత్రి అభివృద్ధికి సహకరించడంలో సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్తులో కూడా రోగులకు మెరుగైన సేవ చేయడంలో ఈ ఆస్పత్రికి మద్దతిస్తానని హామీ ఇచ్చారు. ఆస్పత్రికి ఉదార విరాళం ఇచ్చినందుకు సంస్థ సీఈవో డాక్టర్ ఇ.విశ్వతేజ, లయన్ కృష్ణారావు, డైరెక్టర్ కృష్ణారావులకు ట్రస్టీ డాక్టర్ ఉమామహేశ్వరరావు, ప్రొఫెసర్ ప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

సీతమ్మధార: ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధిలో పేకాటాడుతున్న ఇంటిపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి పది మందిని అదుపులోకి తీసుకున్నారు. వివరాలిలా.. రామాటాకీస్ స్టేట్ బ్యాంక్ దరి వెజిటబుల్ మార్కెట్ వద్ద అపార్ట్‌మెంట్‌లో గుట్టుచప్పుడు కాకుండా కొందరు పేకాట ఆడుతున్నట్లు సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేశారు. పది మందిని అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి రూ.6,500 నగదు, 9 సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకొని ద్వారకా పోలీసులకు అప్పగించారు. పది మందిపై కేసు నమోదు చేశారు.

అంతర్రాష్ట్ర ముఠా కోసం ఆరా

సీతమ్మధార: నగరంలో సంచరిస్తున్న అంతర్రాష్ట్ర ముఠా కోసం ద్వారకా పోలీసులు చురుగ్గా ఆరా తీస్తున్నారు. ఒక జ్యూయలరీ దుకాణం యాజమాన్యాన్ని మోసగించి నకిలీ వెండితో బంగారం అపహరించబోయిన ఇద్దరు పాత నేరస్తులను ద్వారకా పోలీసులు అదుపులోకి తీసుకోవడం తెలిసిందే. పంజాబ్‌కు చెందిన ఇద్దరు మహిళలు బుధవారం ద్వారకానగర్‌లోని వైభవ్ జ్యూయలరీ షాప్‌కు వెళ్లి మూడు కిలోల వెండి చూపించడం, దాన్ని తీసుకొని బంగారం కావాలని చెప్పి మోసం చేసేందుకు ప్రయత్నించారు. విషయం తెలుసుకున్న ద్వారకా సీఐ డి.వి.రమణ సంఘటనా స్థలానికి వెళ్లి ఇద్దరు మహిళలను విచారించి పోలీస్ స్టేషనకు తరలించారు. 2024లో ఇదే తరహాలో అదే బంగారు షాపులో నకిలీ వెండి ఇచ్చి బంగారం అపహరించారని పోలీసులు గుర్తు చేశారు. గతంలో వచ్చిన మహిళలు వీరేనని గుర్తించి, వారిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. లాడ్జీల్లో తనిఖీ చేసిన పోలీసులు మరో ఇద్దరు మహిళలను అదుపులోకి తీసుకున్నారు. గురువారం కూడా ద్వారకానగర్, డైమండ్ పార్క్, ఆర్టీసీ కాంప్లెక్స్ తదితర ప్రాంతాల్లోని లాడ్జీల్లో పోలీసులు తనిఖీలు చేశారని సమాచారం. నగరంలో సంచరిస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను ఎలాగైనా పట్టుకోవాలనే పట్టుదలతో ద్వారకా పోలీసులు విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టడం విశేషం. నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధి రైల్వే న్యూకాలనీలోని సింహపూరి లాడ్జీలో ఇద్దరు మహిళలను కూడా అదుపులోకి తీసుకుని పోలీసులు ఎంవీపీ స్టేషన్‌లో విచారణ చేస్తున్నారు.

అన్నదానం.. పుణ్యకార్యం


రైల్వే న్యూకాలనీలో ఉగాది వేడుకలకు సిద్ధమైన షిర్డీసాయి ధ్యాన మందిరం

అన్నార్తుల సేవలో తరిస్తున్న రైల్వే న్యూకాలనీ ధ్యాన మందిరం

మహత్తర కార్యక్రమానికి ఉగాది నాటికి 15 వసంతాలు

శ్రీరామనవమి వరకు ప్రత్యేక కార్యక్రమాలు

తాటిచెట్లపాలెం: అన్ని దానాల్లో అన్నదానం మిన్న. ఇది గొప్ప పుణ్య కార్యం. ఈ మహత్తర కార్యక్రమాన్ని రైల్వే న్యూకాలనీ రైల్వే ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఎదురుగా గల షిర్డీసాయిబాబా ధ్యాన మందిరంలో ప్రారంభించి ఉగాది నాటికి 15 వసంతాలు పూర్తవుతున్నాయి. ఈ సందర్భంగా పలు ప్రత్యేక కార్యక్రమాలు, భారీ అన్నదానం నిర్వహిస్తున్నారు. అన్నదాన మహోత్సవ వార్షికోత్సవం సందర్భంగా ఉగాది పర్వదినం ఆదివారం నుంచి శ్రీరామనవమి వరకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

2010లో ఉగాది రోజున ప్రారంభం

ధ్యాన మందిరంలో 2010 మార్చి 16వ తేదీ ఉగాది రోజున అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. నాడు కేవలం 10 మందితో గురువారాల్లో మాత్రమే ఆరంభమైన అన్నదానం నేడు దిన దిన ప్రవర్ధమానమై నిత్యాన్నదానంగా మారింది. అప్పటి నుంచి ప్రతి ఏడాది క్రమం తప్పకుండా ఉగాది రోజుల్లో అన్నదాన వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. సాధారణ రోజుల్లో 100 మంది, గురువారాల్లో సుమారు 300 మంది వరకు ఇక్కడ జరిగే అన్నదానంలో పాల్గొంటున్నారు.


కోవిడ్ సమయంలో సుబ్బలక్ష్మీ కల్యాణ మండపంలో పేదలకు ఆహారం పంపిణీ (ఫైల్)


ప్రత్యేక అన్నసమారాధనలో మాలధారులు(ఫైల్)

విశేష సేవలు

- ఏ సమయంలోనైనా అన్నార్తుల ఆకలి తీర్చేందుకు ఇంటర్నేషనల్ వైజ్ ఫౌండేషన్ సహకారంతో సమకూర్చి ధ్యాన మందిరం వద్ద ఏర్పాటు చేసిన కమ్యూనిటీ ఫ్రిజ్‌లో 24 గంటలు ఆహారం అందుబాటులో ఉంచుతున్నారు.
- కోవిడ్ సమయంలో కూడా ఇక్కడ ఆహారం తయారు చేసి, ప్యాకెట్ల రూపంలో స్థానిక సుబ్బలక్ష్మీ కల్యాణ మండపంలో ఆశ్రయం పొందిన పేదలకు అందజేశారు.
- ధ్యాన మందిరం వద్ద పేదలు, యాచకులు, భక్తులతోపాటు వివిధ మాలధారులకు ప్రత్యేక అన్నదానం నిర్వహిస్తున్నారు.
- ఆధ్యాత్మిక పర్వదినాల్లో విశేష సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు.


నిత్యాన్నదానంలో పాల్గొన్న భక్తులు, పేదలు (ఫైల్)

భక్తులు, దాతల సహకారం



భక్తులు, దాతల సహకారంతో నిత్యాన్నదాన కార్యక్రమాన్ని 15 ఏళ్లుగా నిర్విఘ్నంగా కొనసాగిస్తున్నాం. బాబా దయతో ప్రతి రోజూ అన్నార్తుల ఆకలి తీర్చగలుగుతున్నాం. కొన్నేళ్లుగా పేదలు, యాచకులు, భక్తులతోపాటు మాలధారులకు అన్నదానం చేస్తున్నాం. 30, 40 రోజుల పాటు వివిధ మాలలు ధరించిన భక్తులకు ప్రత్యేకంగా వంటకాలు చేసి అన్నదానం చేయగలుగుతున్నాం.

– నూకల శేషగిరిరావు, ధ్యాన మందిర వ్యవస్థాపకుడు

ఉగాది పర్వదినాన భారీ అన్నదానం



ఉగాది పర్వదినం సందర్భంగా ఆదివారం ఉదయం 7 గంటల నుంచి భక్తుల స్వహస్తాలతో సాయిబాబాకు ప్రత్యేక క్షీరాభిషేకం, పంచామృతాభిషేకాలు, సహస్ర నామార్చన, పంచాంగ శ్రవణం, గీతాలాపన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. మధ్యాహ్నం సుమారు 500 మందికి భారీ అన్నదానం చేస్తున్నాం. ఉగాది వేడుకలు ఏప్రిల్ 6వ తేదీ శ్రీరామనవమి వరకు జరుపుతున్నాం.

– త్రిపురాన రాంబాబు, ధ్యాన మందిర వ్యవస్థాపకులు

పోక్సో కేసుతో భవిష్యత్తు అంధకారం


పోక్సో చట్టంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అదనపు న్యాయాధికారి వెంకటరమణ

సీతమ్మధార: స్థానిక పీ అండ్ టీ కాలనీలోని జీవీఎంసీ ఎన్ఎంసీ హైస్కూల్‌లో గురువారం పోక్సో చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా కోర్టు 1వ అదనపు న్యాయాధికారి ఎం.వెంకటరమణ విద్యార్థులకు పోక్సో యాక్ట్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోక్సో చట్టం–2012 లైంగిక వేధింపుల నుంచి రక్షణ కల్పిస్తుందన్నారు. శారీరకంగా లేదా మానసికంగా ఎవరు వేధించినా పిల్లలు ఫిర్యాదు చేస్తే పోలీసులు చర్యలు తీసుకుంటారని తెలిపారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతారని, తగిన రక్షణ కల్పిస్తారని చెప్పారు. జీవించే హక్కు, చదువుకునే హక్కు, స్వేచ్ఛగా ఉండే హక్కులను కాపాడటానికి, నేరాల తీవ్రత తగ్గించడం కోసం పిల్లలకు సత్వర న్యాయం అందించడానికి పోక్సో చట్టం ద్వారా త్వరగా విచారించి శిక్షలు విధిస్తారన్నారు. ఈ చట్టం గురించి విద్యార్థులు శ్రద్ధగా విని, తెలుసుకొని ఇంటి చుట్టుపక్కల వారికి, బంధుమిత్రులకు తెలియజేయాలని కోరారు. పోక్సో చట్టం కింద కేసు నమోదైన వారికి భవిష్యత్ అంధకారమేనని అదనపు న్యాయాధికారి వెంకటరమణ హెచ్చరించారు. కార్యక్రమంలో ఉప విద్యా శాఖాధికారి సోమేశ్వరరావు, కౌన్సిలర్ శకుంతల, అన్ని కుమారి, కార్మిక శాఖ ఆఫీసర్ విజయశ్రీ, ద్వారకా స్టేషన్ ఎస్ఐ శ్రీను, ఐసీడీఎస్ అధికారి రమణి, బేగం, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న మేజిస్ట్రేట్ అనురాగ్ కొమ్మూది

కంచరపాలెం: మైనర్లు, తల్లిదండ్రులు టీచర్లు పోక్సో చట్టంపై అవగాహన కలిగి ఉండాలని ఏడో ఎడిషనల్ మేజిస్ట్రేట్ అనురాగ్ కొమ్మూది తెలిపారు. కంచరపాలెం రామ్మూర్తిపంతులుపేట జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో గురువారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన న్యాయమూర్తి అనురాగ్ మాట్లాడుతూ నూతన చట్టాలపై ముఖ్యంగా పోక్సో వంటి వాటిపై బాలబాలికలు తెలుసుకోవాలని పిలుపునిచ్చారు. తెలిసీ తెలియని వయసులో ప్రేమ, ఈవ్‌టీజింగ్‌లకు పాల్పడుతూ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని, అందుకు గల కారణాలను న్యాయమూర్తి వివరించారు. ఎటువంటి న్యాయ సలహాలకైనా జిల్లా న్యాయ సేవాధికారి సంస్థను సంప్రదించవచ్చని ఆయన తెలిపారు. ఆర్పీపేట యూపీహెచ్‌సీ ప్రధాన వైద్యాధికారి మట్టా శశిప్రియాంక, పాఠశాల హెచ్ఎం ఆర్.శ్రీనివాసరావు, కంచరపాలెం ఎస్ఐ రవికుమార్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు ఎం.రజిని, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ మనోజ్‌కుమార్, సోషల్ వర్కర్లు సురేఖ, శారదా దేవి, ఉపాధ్యాయ సిబ్బంది, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మార్కెట్‌లోకి రాయల్ ఎన్‌ఫీల్డ్ కొత్త బైక్


రాయల్ ఎన్‌ఫీల్డ్ 650 ట్విన్ బైక్‌ను ఆవిష్కరిస్తున్న సీతారామయ్య చౌదరి

తాటిచెట్లపాలెం: నగర రోడ్లపై పరుగులు తీసేందుకు ప్రపంచ ప్రఖ్యాత ద్విచక్ర వాహన సంస్థ రాయల్ ఎన్‌ఫీల్డ్ నుంచి అద్భుత ఫీచర్లతో ఆధునిక రాయల్ ఎన్‌ఫీల్డ్ 650 ట్విన్ బైక్ గురువారం మార్కెట్‌లోకి అడుగుపెట్టింది. దొండపర్తిలోని సీతారామ్ మోటార్స్‌లో ఖాతాదారులు, బైకర్స్‌తో కలిసి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ జి.వి.వి.సీతారామయ్య చౌదరి బైక్‌ను ఆవిష్కరించారు. అత్యంత ఆదరణ పొందిన రాయల్ ఎన్‌ఫీల్డ్ క్లాసిక్ 350 మోడల్ కంటే శక్తివంతమైన 650 సీసీతో ఈ బైక్‌ను రూపొందించారు. మరింత భద్రతా ప్రమాణాలు, ఎల్ఈడీ హెడ్ లైట్స్, ఇండికేటర్స్, అడ్జస్టబుల్ క్లచ్, బ్రేక్ లివర్స్, యూఎస్‌బీ చార్జింగ్ పాయింట్, గేర్ పొజిషన్ ఇండికేటర్, ట్రిప్పర్ వంటి అత్యాధునిక ఫీచర్లతో, ఆకర్షణీయమైన 4 రంగుల్లో ఈ బైక్ అందుబాటులో ఉన్నట్లు రాయల్ ఎన్‌ఫీల్డ్ ప్రతినిధులు తెలిపారు. దొండపర్తి, గురుద్వారా, మధురవాడ, మద్దిలపాలెం ప్రాంతాల్లోని సీతారామ్ మోటార్స్‌లో బైక్ బుకింగ్‌లు ప్రారంభమయ్యాయని, ప్రారంభ ధర రూ.3.37 లక్షల (ఎక్స్‌షోరూం) నుంచి ఉన్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జి.నరేంద్ర చౌదరి, ఏరియా సేల్స్ మేనేజర్ జె.కల్యాణ్‌దీపక్ తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతతోనే పెన్షనర్ల సమస్యలకు పరిష్కారం


సమావేశంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్

తాటిచెట్లపాలెం: పెన్షనర్లంతా ఐక్యతతో ఉంటే సమస్యల సాధన సులభమవుతుందని ఆలిండియా బీఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎం.ఆర్. పట్నాయక్ అన్నారు. రైల్వేన్యూకాలనీ సమీపంలోని సుబ్బలక్ష్మి కల్యాణ మండపంలో గురువారం జరిగిన పెన్షనర్ల అసోసియేషన్ ఉమ్మడి విశాఖ జిల్లా సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. పెన్షనర్ల సమస్యలను పరిష్కరించుకోవాలంటే అందరూ ఐక్యంగా సాగాలన్నారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కుప్పిలి చంద్రశేఖర్ మాట్లాడుతూ ఈ ఏడాది నవంబరులో కేరళలోని కొచ్చిన్‌లో జాతీయ సమావేశాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. జిల్లాలో పెన్షన్‌దారుల సభ్యత్వం 1500కు చేరుకుందని, ఆలిండియాలో లక్షకు చేరువలో ఉందన్నారు. మనలో మాణిక్యాలు పేరిట వివిధ రంగాల్లో సేవలందించిన పలువురు పెన్షన్‌దారులను సత్కరించారు. అవార్డులు అందుకున్న వారిలో రామశర్మ(కార్టూన్ రంగం), టి రాజేశ్వర్(అంతర్జాతీయ పర్యాటకం), కేవీడీ స్వామి(సీజీహెచ్ఎస్)లు ఉన్నారు. కార్యక్రమంలో సంఘ జిల్లా కార్యదర్శి కె.సోమసుందరరావు, అడ్వైజరీ శ్రీమన్నారాయణ, కోశాధికారి పిన్నింటి బాబూరావు, సీనియర్ నేత శర్మ, ఇతర పింఛన్‌దారులు పాల్గొన్నారు.

రైల్వే ఉద్యోగులందరికీ అధికార భాషపై శిక్షణ


హిందీ మ్యాగజైన్‌ను ఆవిష్కరిస్తున్న డీఆర్ఎం లలిత్ బోరా, అధికారులు

తాటిచెట్లపాలెం: దొండపర్తిలోని (డివిజనల్ రైల్వే మేనేజర్(డీఆర్ఎం) కార్యాలయంలో గురువారం డివిజనల్ అఫీషియల్ లాంగ్వేజ్ ఇంప్లిమెంటేషన్ కమిటీ సమావేశం జరిగింది. అధికారిక భాషా అమలులో అనుసరించాల్సిన పలు విషయాలను రాజభాషా విభాగం సిబ్బంది వివరించారు. ఈ సందర్భంగా రాజభాషా అధికారి, అసిస్టెంట్ కమర్షియల్ మేనేజర్ సంతోష్‌కుమార్ మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని అన్ని విభాగాల్లో అధికారిక భాషా అమలు ప్రాధాన్యాన్ని వివరిస్తూ, ఉద్యోగులకు అవగాహన కల్పించాలన్నారు. ఉద్యోగులందరికీ అధికారిక భాషపై, టైపింగ్‌లో అవసరమైన శిక్షణ ఇచ్చి, దైనందిన కార్యకలాపాల్లో హిందీ భాష వినియోగించేలా చర్యలు తీసుకోవాలని డీఆర్ఎం లలిత్ బోరా సూచించారు. అనంతరం హిందీ మ్యాగజైన్ విశాఖ వాణిని అధికారులతో కలిసి డీఆర్ఎం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎంలు(ఆపరేషన్స్) మనోజ్‌కుమార్ సాహూ, (ఇన్‌ఫ్రా) ఇ.శాంతారాం, పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

హౌసింగ్ దరఖాస్తుదారులకు చెక్కుల పంపిణీ


చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

సీతమ్మధార: తాను అసెంబ్లీలో మాట్లాడటం వల్లే హౌసింగ్ పథకం కింద ఇళ్లు రాని దరఖాస్తుదారులకు డీడీలను ప్రభుత్వం వాపస్ చేస్తోందని ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు తెలిపారు. సీతమ్మధారలోని బీజేపీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన హౌసింగ్ దరఖాస్తుదారులకు చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పీఎంఏవై పథకం కింద ఇళ్ల కోసం 2017లో ఎంతోమంది ప్రజలు డబ్బులు కట్టారని గుర్తుచేశారు. ఇళ్లు రాని వారికి తిరిగి డబ్బులివ్వాలనే ఉద్దేశంతో అసెంబ్లీలో తాను మాట్లాడి, సీఎం చంద్రబాబుతో కూడా మాట్లాడిన తర్వాత డబ్బులు వాపస్ వస్తున్నాయన్నారు. అనంతరం 40 మందికి రూ.8.63 లక్షల చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. బీసీ కార్పొరేషన్ ఇస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జీవీఎంసీ జోన్–5 కమిషనర్ రాము, ఏపీడీ పుణ్యవతి, కార్పొరేటర్ హనోక్, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

చెట్ల కొమ్మలు నరికారు.. తరలించడం మరిచారు


కెమికల్ ఇంజనీరింగ్ కాలేజీ నూతన భవనం వద్ద వదిలేసిన చెట్ల కొమ్మలు

మురళీనగర్: విద్యుత్ శాఖ సిబ్బంది తమ పని పూర్తయిన తర్వాత బాధ్యత అయిపోయిందని పట్టించుకోకపోవడం పరిపాటిగా మారింది. ప్రతి నెలా వీరు సబ్ స్టేషన్ నిర్వహణ, చెట్ల కొమ్మల తొలగింపు చేపడుతుంటారు. విద్యుత్ సరఫరా చేసే కరెంట్ తీగల దిగువన ఉన్న చెట్ల కొమ్మలు తొలగించేందుకు చర్యలు తీసుకుంటారు. ఇది మంచిదే.. అయితే వీరు నరికిన చెట్ల కొమ్మలను అక్కడే వదిలేసి వాటి తరలింపు తమ బాధ్యత కాదన్న రీతిగా వ్యవహరిస్తున్నారు. కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ(గైస్) ప్రాంగణంలో ఉన్న చెట్ల కొమ్మలను తొలగించి వదిలేశారు. ఇటు విద్యుత్ శాఖ సిబ్బంది.. అటు శానిటరీ సిబ్బంది వీటిని తరలించలేదు. వారం రోజులుగా ఇవి అక్కడ పడి ఉన్నాయి. కొమ్మలను నరికి వదిలేసిన విద్యుత్ శాఖకు వాటిని తొలగించాల్సిన బాధ్యతను విస్మరించడం శోచనీయమని విద్యార్థుల తల్లిదండులు విమర్శిస్తున్నారు. కొమ్మలు కుప్పలుగా పడి ఉండటంతో నూతన భవనం వద్ద అపరిశుభ్రంగా తయారైంది. విషపురుగులు చేరే అవకాశముందని, తక్షణం చెట్ల కొమ్మలను తరలించాలని విద్యార్థులు కోరుతున్నారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి


మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు శ్రావణ్‌కుమార్

మద్రిపాలెం: అప్కోస్ విధానాన్ని రద్దు చేసి, కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, ఔట్‌సోర్సింగ్ కార్మికుల ఉద్యోగాలు పర్మినెంట్ చేయాలని సీఐటీయూ నాయకుడు శ్రావణ్‌కుమార్ డిమాండ్ చేశారు. 51వ వార్డు మాధవధార వుడా కమ్యూనిటీ హాల్ వద్ద గురువారం జోన్–5 పరిధిలోని 49, 50, 51, 52 వార్డులకు సంబంధించి కార్మికులను ఉద్దేశించి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు గొల్లపల్లి సుబ్బారావు 2వ వర్ధంతి ఏప్రిల్ 1న షీలానగర్‌లోని ఆయన నివాసంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొనాలని కోరారు. అన్ని వార్డుల ఆఫీసుల వద్ద ఉదయం కామ్రేడ్ సుబ్బారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించాలన్నారు. ఏప్రిల్ 2న 10.30 గంటలకు రైల్వే డీఆర్ఎం కార్యాలయం నుంచి బహిరంగ సభ, ర్యాలీ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ కార్మికుల ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అదే రోజు సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించాలని కార్మికులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్ల యూనియన్ సీఐటీయూ నాయకులు పాపారావు, దేవి, లక్ష్మి, బాలరాజు, బంగారయ్య, ధన, అప్పలరాజు, రమణ, శంకర్, శివ తదితరులు పాల్గొన్నారు.

నరసింహనగర్ రైతుబజార్‌లో తనిఖీలు


రైతుబజార్‌లో తనిఖీలు చేస్తున్న అధికారులు

సీతంపేట: నరసింహనగర్ రైతుబజార్‌లో గురువారం జిల్లా వ్యవసాయ మార్కెటింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస కిరణ్, ఏడీ షేక్ యాసిన్ ఆకస్మిక తనిఖీలు చేశారు. రైతులు విక్రయిస్తున్న టమాటాలు, అనంతపురం నుంచి వచ్చిన టమాటాలను పరిశీలించారు. రైతుల ఐడీ కార్డులను పరిశీలించి పలు సూచనలిచ్చారు. అధికారుల వెంట రైతుబజార్ ఎస్టేట్ ఆఫీసర్ కొండబాబు తదితరులు ఉన్నారు.